క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



శ్రీ లక్ష్మి నరసింహ కంబగిరి స్వామి

ఉయ్యాలవాడ : శ్రావణ మాసం పురస్కరించుకుని శనివారం మండలంలోని సుద్దమల్ల, ఇంజేడు, ఉయ్యాలవాడ, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి, అభయాంజనేయస్వాములకు కుంకుమార్చన, అభిషేకాలు, ఆకుపూజ, ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు కమలేష్ శర్మ, అనంతయ్య, భాస్కరశర్మ, లక్ష్మణస్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని టెక్కె వీధిలో వెలసిన నాగుల కట్ట దేవాలయంలో శ్రావణ మాసం శనివారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్టుకు ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, సింధూర అభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి వడమాల, సామూహిక కుంకుమార్చన జరిపించి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. మహామంగళ హారతులు నిర్వహించి భక్తులకు వడపప్పు,పానకం ప్రసాదంగా అందజేశారు.

విద్యార్థులూ.. ఆత్మహత్యలకు పాల్పడొద్దు



ఉపాధ్యాయినులతో మాట్లాడుతున్న ఆళ్లగడ్డ సీఐ హనుమంతనాయక్

చాగలమర్రి: విద్యార్థులు క్షణికావేశానికి లోనై ఆత్మహత్యలకు పాల్పడవద్దని సీఐ హనుమంతనాయక్ సూచించారు. శనివారం స్థానిక కస్తూర్బా విద్యాలయయంలో విద్యార్థినులకు కౌన్సెలింగ్ నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థిని దీపిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురించి ఉపాధ్యాయినులను అడిగి తెలుసుకున్నారు. అలాగే శుక్రవారం రాత్రి విధులు నిర్వహించని ఉపాధ్యాయులను కూడా ఆయన విచారించారు. స్థానిక ఎస్ఐ రమణయ్య ఉన్నారు.


ఇంకుడు గుంతలు తవ్వుకోండి



మాచినేనిపల్లె లే అవుట్‌లో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

రుద్రవరం: కొత్తగా నిర్మించుకున్న ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని ఎర్కరగుడిదిన్నె గ్రామ సచివాలయాన్ని శనివారం తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన అదే పంచాయతీ మజరా మాచినేనిపల్లె లే అవుట్‌లో లబ్ధిదారులు నిర్మించుకున్న పక్కా గృహాలను పరిశీలించి ఇళ్ల ముందు మురుగు లేకుండా, నీటి నిల్వలు లేకుండా ఉండేందుకు ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి ఓబులేసు, సిబ్బంది ఉన్నారు.

హమ్మయ్యా.. చినుకులు రాలాయి



మినుముకు ఊపిరి పోసిన వర్షం

దొర్నిపాడు: ఖరీఫ్‌లో భాగంగా సాగుచేసిన పంటలకు శనివారం కురిసిన వానకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విత్తిన పత్తి ఇప్పుడిప్పుడే మొలకెత్తుతోంది. దీంతో ప్రస్తుతం కురిసిన పైరుకు ఊపిరిపోసినట్లయ్యింది. అలాగే కాయ, కంకి దశలో ఉన్న మినుము, మొక్కజొన్న పంటలకు ప్రాణం పోసినట్లయిందని రైతులు చెబుతున్నాన్నారు. మూడు వారాలకు పైగా వర్షం లేక బెట్టపోయిన పంటలకు ప్రస్తుతం కురిసిన వాన ఊరటనిచ్చింది.

ఘనంగా మదర్ థెరిస్సా జయంతి



నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బాలా అకాడమీ రవీంద్ర హైస్కూల్‌లో శనివారం మదర్‌థెరిస్సా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మాధవీలత మాట్లాడుతూ కష్టకాలంలో పేదలకు ఆదుకుందని ఆమె సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశల సాగు..

- కేసీ కెనాల్ ద్వారా ఆరుతడి పంటలకు సాగునీరు
- వరినాట్లు వేయొద్దంటున్న అధికారులు
- ఇప్పటికే నారుపోసుకున్న రైతులు
- వరి కోసం సిద్ధంగా ఉన్న వారిలో ఏ పంట సాగు చేయాలోనని సందిగ్ధత

గోస్పాడు: ఖరీఫ్‌లో సీజన్ పూర్తయినా పూర్తిస్థాయిలో పంటలు సాగు చేసేందుకు రైతులు సందిగ్ధంలో ఉన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగానే ఉండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని రైతులు ఏటా కేసీ కాలువ నీటిపై ఆధారపడి పంటలు సాగు చేస్తారు. అందులో భాగంగా సాంబవరం, దీబగుంట్ల, కానాలపల్లె, నెహ్రూనగర్, ఎస్.నాగులవరం, జిల్లెల్ల, యాళ్లూరు, శ్రీనివాసపురం, ఎం.చింతకుంట్ల, జూలేపల్లె, గోస్పాడు, పసురపాడు తదతర గ్రామాల్లో రైతులు వరి పంట సాగుకు సమాయత్తమయ్యారు. ఈ ఏడాది వర్షాలు కొంతమేర ఆలస్యం కావడంతో పంట సాగుకు ఆటంకం ఏర్పడుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కేసీ కాల్వలో ప్రవహిస్తున్న నీరు

ఇప్పటికే పలుచోట్ల పంటల సాగు..

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఇప్పటికే పంటలు సాగుచేశారు. ఖరీఫ్ సాగుకు ముందస్తుగా మినుము, మొక్కజొన్న, సోయాబీన్, మిరప, వేరుశనగ, కందితో పాటు సాలు వరి సాగు చేశారు. అయితే వర్షాలు సరైన సమయంలో కురవకపోవడంతో సాగు చేసిన పంటలు వాడుముఖం పడుతుండటంతో సాగు నీటి కోసం ఎదురు చూస్తున్నారు. ఏటా మండలంలో 10వేల ఎకరాల్లో వరి పైరు సాగవుతుంది. ఈ ఏడాది 2వేల ఎకరాలకు లోపు సాగైంది. కాగా..గతేడాది వాతావరణం, వరుణుడు సహకరించడంతో వరి దిగుబడి ఆశాజనకంగా లభించింది. ధర కూడా కలిసి రావడంతో రైతులు లాభాలు చూశారు.



చింతకుంట సమీపంలో సాగు చేసిన సాలు వరి

మండల పరిధిలో రైతులు సాగు చేసిన పంటల వివరాలు..

పంటలు	సాధారణ విస్తీర్ణం హెక్టార్లలో	సాగైన విస్తీర్ణం హెక్టార్లలో
వరి	4,742	975
మొక్కజొన్న	67	112
కందులు	93	20
మినుము	598	567
మిరప	446	290
వేరుశనగ	98	103
సోయాబీన్	105	287

నెల	సాధారణవర్షపాతం మి.మీ	కురిసిన వర్షం మి.మీ
జూన్	92.3	99
జూలై	130.5	169.6
ఆగస్టు	117.1	26.8

సిద్ధంగా నారు..

నెలాఖరు లోపు మండలంలో వరి నాట్లు పూర్తయ్యేవి. అయితే వరుణుడు కరుణించకపోవడంతో ఈ ఏడాది పంట అతి తక్కువగా సాగైంది. ఇప్పటికే బోర్ల కింద నారు పోయగా నాటుకు సిద్ధంగా ఉంది. అయినా వానలు లేకపోవడం, కేసీ కెనాల్ పరిధిలో కేవలం ఆరుతడి పంటలకు మాత్రమే నీటిని వదులుతున్నామని, వరి సాగుచేయొద్దని అధికారులు పేర్కొనడంతో నారును ఏమి చేయాలో, ఏ పంట సాగు చేయాలో అర్థం కాని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

నీటి రాకతో ఊరట..

ఇప్పటికే సాగు చేసిన ఆరుతడి పంటలు వర్షం లేక వాడుతున్నాయి. పరిస్థితిని గమనించిన ప్రభుత్వం కాల్వలకు నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రస్తుతం కేసీ కేనాల్‌కు నీటిని విడుదల చేశారు. అయితే.. కేవలం ఇప్పటికే సాగు చేసిన, ఎండిపోతున్న దశలోనున్న పంటలకు మాత్రమే నీటిని విడుదల చేశామని, ఈ నీటితో వరి నాట్లు వేయొద్దని అధికారులు సూచించారు. మరో కొన్ని రోజులు కాలువలో నీరు పారే అవకాశముంది. ఆ తరువాత పరిస్థితినిబట్టి విడుదల చేసే అవకాశముంది. కాలువకు నీరు విడదల చేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పంటలు ఎండిపోతున్న దశలో నీరు రావడంతో పైర్లకు ప్రాణం పోసినట్లయ్యింది.

ఇప్పటికే వరి పంట సాగు చేశా



నాకున్న నాలుగు ఎకరాల సొంత పొలంతో పాటు మరో 40 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేస్తున్నా. అయితే ఈ ఏడాది వర్షం రాక కొంత ఆలస్యం కావడంతో నీరు వస్తుందో లేదోనని ఇబ్బందులు పడ్డాను. అయినా ఇప్పటికే 20 ఎకరాలకు పైగా సాలువరి, మరో 10 ఎకరాలకు పైగా వరినాట్లు వేశాం. పంటకు నీటి అవసరం ఉంది. – సిద్ధయ్య, రైతు సాంబవరం

నీరు అందకపోతే ఇబ్బందులు..



ప్రతి ఏడాది కేసీ కాల్వకు వచ్చే నీటి ఆధారంగా వరి పంట సాగు చేస్తాం. అయితే ఈ ఏడాది కూడా ముందుగా వరి నారు మడులు సిద్ధం చేశాం. అయితే నీరు ఎప్పుడు వస్తుందో తెలియక పంట సాగు కొంత ఆలస్యమయ్యే అవకాశముంది. వర్షం లేకపోవడంతో ఆరుతడి పంటలకు మాత్రమే నీరు వస్తుండటంతో, వరి పంట సాగుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. –వెంకటేశ్వరరావు, రైతు శ్రీనివాసపురం

ఆలయ జీర్ణోద్ధరణ పనులకు భూమి పూజ



జీర్ణోద్ధరణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): మండలంలోని అయ్యలూరు గ్రామంలోని శ్రీ ఉమా సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులను ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ మధుసూదన్‌రెడ్డితో కలిసి శనివారం భూమి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీర్ణోద్ధరణ పనులకు రాష్ట్ర దేవదాయ శాఖ సీజీఎఫ్ నిధుల కింద రూ.75 లక్షలు కేటాయించిదని తెలిపారు. పురాతన దేవాలయమై ఈ ఆలయ జీర్ణోద్ధరణకు భూమి చేయడం సంతోషంగా ఉందన్నారు. గతంలోనే నిర్వహించాల్సిన పనులపై కొందరు కోర్టులకు వెళ్లడంతో నిలిచిపోయాయని, అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో పనులు చేపట్టినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి , ఆలయ ఈఓ మాధవరెడ్డి, నాయకులు, గ్రామ పెద్దలు, అర్చకులు పాల్గొన్నారు.అనంతరం ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు స్వామి వారిని సత్కరించి, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేసి ఆశీర్వచనం చేశారు.

టీడీపీ నాయకుడికి సీఎం సహాయనిధితో వైద్యం

మండలంలోని అయ్యలూరు గ్రామానికి చెందిన టీడీపీ మాజీ వార్డు సభ్యుడు నాగేశ్వరరావు గుండె సంబంధిత వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.8 లక్షలు అందించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. సీఎం సహాయ నిధితో వైద్యం చేయించుకుని తిరిగి ఆరోగ్యంగా ఇంటికి వచ్చిన నాగేశ్వరరావును ఎమ్మెల్యే శిల్పా రవి, పీపీ మధుసూదన్‌రెడ్డి, బసవేశ్వరరెడ్డితో కలిసి శనివారం పరామర్శించారు. ప్రస్తుతం తాను ఆరోగ్యంగా ఉన్నాని ఇందుకు సహకరించిన ఎమ్మెల్యేవి, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బసవేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో లేని వ్యాధితో బాధపడుతున్న నాగేశ్వరరావు పరిస్థితి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందేలా చేశారని చెప్పారు.

పరామర్శ..

సీనియర్ పాత్రికేయుడు షరీఫ్‌కు అండగా ఉంటానని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మోకాలి శస్త్ర చికిత్స చేయించుకొని జ్ఞానాపురంలోని ఇంటిలో ఉంటున్న షరీఫ్‌ను ఎమ్మెల్యే శిల్పా రవి శనివారం పరామర్శించారు. కౌన్సిలర్ మనోరంజని,నాయకులు దాల్‌మీల్ అమీర్, భాస్కరరెడ్డి, ఎద్దురవి ఉన్నారు.

సేవ చేసే వారికే పట్టం కట్టండి



లబ్ధిదారుడికి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేసే వారికే పట్టం కట్టాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కోరారు. శనివారం గోవిందపల్లెలో 5వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నవరత్నాలు, వివిధ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని ఇంటింటికి తిరిగి వివరించారు. ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అర్హులైన వారందరికీ పథకాలు అందించాలనే ధ్యేయంతో పని చేస్తుందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రైతు సంక్షేమం కోసం రైతు భరోసా, పంట నష్టం, రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామని వివరించారు. ప్రతి పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల పేరుతో అమలు చేస్తున్నారని, ఇందుకు వారికి ప్రాధాన్యమివ్వాలనే ఉద్దేశమని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో ఏ వర్గానికి సంపూర్తిగా పథకాలు అందలేదని, కేవలం జన్మభూమి కమిటీల పేరిట వారి కార్యకర్తలకే అందజేశారని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా.. పాలన తీరు, పథకాల అమలు, అభివృద్ధి, సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యేలు, మంత్రులు తమ నియోజకవర్గాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలను అడిగి తెలుసుకోవడం ఇదే ప్రథమమన్నారు. ప్రజా ప్రతినిధి అంటే కేవలం ఎన్నికల సమయంలోనే కాదని, నిత్యం వారి మధ్యలో ఉండాలని జగనన్న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వివరించారు. తమలా నిత్యం అందుబాటులో ఉండకుండా ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నాయకులు విమర్శలు చేస్తూ ప్రజల్లోకి వచ్చి మోసపూరిత మాటలు చెబుతున్నారని, వారిని నమ్మితే భారీగా నష్టపోతారని సూచించారు. అనంతరం జరిగిన గడప గడప కార్యక్రమంపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి రూ. 40 లక్షలు మంజూరవుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, సర్పంచు మరియమ్మ, ఉప సర్పంచు శేషారెడ్డి, సొసైటీ చైర్మన్ రాజశేఖరరెడ్డి, ఎంపీపీ నాయక్ వసీం, బీ.అబ్దుల్ సలాం, వీరారెడ్డి పల్లె సర్పంచ్ శివారెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు



గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేపై వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తున్న కలెక్టర్

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతాయుతంగా పనిచేయాలని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ హెచ్చరించారు. మండలంలోని పెద్దకొట్టాల గ్రామ సచివాలయం, ఆర్బీకేలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్బీకే పరిధిలో ఎంత మంది రైతులు ఏఏ పంటలు సాగు చేశారు, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారంటూ విలేజ్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. రసాయనిక ఎరువులు, బయోపెస్టిసైడ్స్ తదితర ఫిర్యాదులపై కలెక్టర్ ఆరాతీశారు. అనంతరం గ్రామ సచివాలయంలో హాజరుపట్టీతో పాటు స్పందనకు సంబంధించిన రిజిష్టర్లను పరిశీలించిన అనంతరం బడి ఈడు పిల్లల నమోదు(గ్రాస్ ఎన్రోల్‌మెంట్ సర్వే) డేటాలో 54 మంది చిన్నారులకు బ్లాక్ టిక్ ఉండడానికి కారణాలేమిటని వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. చైల్డ్ ఐడీ లేని కారణంగా బ్లాక్ టిక్ ఉందని వెల్ఫేర్ అసిస్టెంట్ సమాధానం ఇవ్వగా గుర్తించిన పిల్లలకు చైల్డ్ ఐడీ ఎందుకు లేదని సీఆర్పీ, ఎంఈఓను ప్రశ్నించారు. వారి నుంచి సమాధానం రాకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తు విధులపట్ల బాధ్యతాయుతంగా మెలగాలని ఆదేశించారు. డ్రాప్ అవుట్ పిల్లలను పాఠశాలలో, దివ్యాంగ చిన్నారులను చైల్డ్ భవిత సెంటర్లలో చేర్పించాలన్నారు. బూత్‌స్థాయి అధికారులు ఇంటింటా ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కువమంది ఓటర్లు ఉన్న గృహాలను గుర్తించాలని చెప్పారు. ఎంపీడీఓ సుగుణశ్రీ, ఈఓఆర్డీ మహీధర్‌రెడ్డి, ఎంఈఓ బ్రహ్మం నాయక్ ఉన్నారు.

సంక్షిప్తం

సీఎంకు కృతజ్ఞతలు

నంద్యాల(వ్యవసాయం): నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్యను తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమించినందుకు నాయీబ్రాహ్మణ రాష్ట్ర కార్యదర్శి మల్లుగాళ్ల సుబ్బరాయుడు, శ్రీశైలం పాలక మండలి సభ్యురాలు విజయలక్ష్మి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలైన నాయీబ్రాహ్మణులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించినందుకు అభినందనలు తెలిపారు. జాతి అభివృద్ధికి సీఎం ఎంతో సహకారం అందించారని చెప్పారు. అలాగే నంద్యాల జిల్లా నాయీబ్రాహ్మణుల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం,సెక్రటరీ శీనయ్య, మద్దయ్య, రాంపుల్లయ్య, నాగపుల్లయ్య, వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

నంద్యాల(న్యూటౌన్): చాగలమర్రి కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాత్నంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లాకార్యదర్శి ధనుంజయుడు కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థినులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి, బాలికలకు రక్షణ కల్పించలేని అధికారిణిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎర్రిస్వామి, మనోహర్, వెంకట్ హనుమంతు, శేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సమాచారమివ్వండి

నంద్యాల(న్యూటౌన్): ఉప, మండల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులకు సమాచారాన్ని తెలియజేయాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల స్టేటస్‌ను కమిషనర్ పాఠశాల విద్యాశాఖ ఎప్పటికప్పుడు సంబంధిత డీడీఓ లాగిన్‌లకు పంపుతుందన్నారు. బిల్లుల స్టేటస్‌ను తెలుసుకోవడానికి కమిషనర్ ఆఫీసుకు వస్తున్నారని, దీంతో ఉపాధ్యాయుల తాకిడి ఎక్కువైందని, వీటి వల్ల ఆఫీసు పనులు కుంటు పడుతున్నాయన్నారు. సంబంధిత డీడీఓలు లాగిన్‌లలో మెడికల్ బిల్లుల సమాచారాన్ని సంబంధిత ఉపాధ్యాయులకు తెలియజేయాలని కమిషనర్ ఆదేశించినట్లు చెప్పారు.

రేపు పీఈటీలకు, పీడీలకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలు

నంద్యాల(న్యూసిటీ): జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సోమవారం జిల్లా పీఈటీ, పీడీలకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ సుధాకర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల నియోజక వర్గంలోని చాబోలు జెడ్పీహెచ్ పాఠశాల, నందికొట్కూరు జెడ్పీహెచ్ పాఠశాల, ఆళ్లగడ్డలోని ఆర్.కృష్ణాపురం ఉన్నత పాఠశాల, డోన్‌లోని యూ కొత్తపల్లి ఉన్నత పాఠశాల, బనగానపల్లెలోని నందవరం, పాణ్యంలోని పాణ్యం, శ్రీశైలం నియోజకవర్గంలోని శ్రీశైలం ఉన్నత పాఠశాలల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశలు సోమవారం ఉదయం 8.45 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటాయాని పేర్కొన్నారు. ప్రైవేట్ మినహా అన్ని యాజమాన్యాల పీఈటీ, పీడీలు క్రీడా దుస్తులు ధరించి హాజరు కావలని సూచించారు.

తాగునీటికి వినియోగించండి

నంద్యాల(వ్యవసాయం): వర్షాభావం కారణంగా శ్రీశైలం జలాశయం నీటిని రాయలసీమ వాసుల తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సూపుల రామచంద్రారెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం రిజర్వాయర్‌లోని నీటిని విద్యుత్ ఉత్పత్తికి వినియోగించడం వల్ల సీమ వాసులు తాగు, సాగు నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసి సీమ వాసులకు న్యాయం చేయాలన్నారు. అలాగే గోరుకల్లు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు.సభ్యులు తూము శివారెడ్డి, పుల్లారెడ్డి, శివనాగిరెడ్డి, గుప్త పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

దొర్నిపాడు:ఓ హిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తనను మానసికంగా, శారీరంగా వేధిస్తున్నాడని భార్య తన భర్తపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ తిరుపాల్ తెలిపిన మేరకు వివరాలు..డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన సారమ్మను బేతంచర్లకు చెందిన జకరయ్య, జయమ్మల కుమారుడు తిమోతికి ఇచ్చి వివాహం చేశారు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తు జీవనం సాగిస్తున్న తిమోతి ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడమే గాక అదనపు కట్నం తీసుకరావాలని భార్య సారమ్మను వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తమామలు, భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

పదోన్నతుల సమస్య పరిష్కరించాలి

గోస్పాడు: తెలుగు ఉపాధ్యాయుల పదోన్నుతుల సమస్య పరిష్కరించి వెంటనే పదోన్నుతులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోర్టులో ఉన్న తెలుగు ఉపాధ్యాయుల పదోన్నుతుల సమస్యపై ప్రభుత్వం చొరవ తీసుకుని పరిష్కరించి న్యాయం చేయలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయినులకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని, నాడు-నేడు పనులు జరుగుతున్న ఏకోపాధ్యాయ పాఠశాలలకు అదనంగా ఉపాధ్యాయులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు విజయరావు, షుక్రబాబు, అహ్మద్ హుసేన్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సీఐ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున సీఐ

బొమ్మలసత్రం: ప్యాపిలి సీఐగా బాధ్యతలు స్వీకరించిన జీ.సుధాకర్‌రెడ్డి శనివారం జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డిని స్థానిక కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నందికొట్కూరు రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ప్యాపిలి సీఐగా బదిలీ అయ్యారు. బాధ్యతల స్వీకరణ అనతంరం ఆయన ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి



మాట్లాడుతున్న నంద్యాల ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్

బొమ్మలసత్రం: విద్యార్థులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని నంద్యాల ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ సూచించారు. శనివారం ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు హెల్మెట్ వాడకం, రోడ్డు భద్రత నియమాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్రవాహనం నడిపేటపుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్ చేయరాదన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించకపోతే జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఒక్క చిన్న తప్పిదం వల్ల వాహనం నడిపే వారే కాకుండా అవతలి వారు కూడా నష్టపోయే అవకాశముందని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు, వాటిని అతిక్రమిస్తే చట్ట పరంగా తీసుకునే చర్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎంవీఐ శ్రీకాంత్, ఎస్వీఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ కలెక్షన్ సెంటర్ పరిశీలన



ఉయ్యాలవాడలో నూతనంగా నిర్మిస్తున్న కలెక్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీ పోచా

ఉయ్యాలవాడ : స్థానిక కూరగాయల మార్కెట్‌లో రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న మార్కెటింగ్ కలెక్షన్ సెంటర్‌ను ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి శనివారం పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ ఉయ్యాలవాడలో రేనాటి సూర్యచంద్రుల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్షన్ సెంటర్ నిర్వహణ జరుగుతుందన్నారు. పనులు పూర్తయితే రైతులు పండించిన పంటల సేకరణ చేసి మార్కెటింగ్ సదుపాయం అందుబాటులోకి వస్తుందన్నారు. రైతులు పండించిన వివిధ రకాల పంట ఉత్పత్తులను ఇక్కడే గ్రేడింగ్ చేసి నాణ్యమైన ఉత్పత్తులను ప్రజలకు విక్రయిస్తారని, తద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు మార్కెట్‌లో కల్పిస్తామన్నారు. ఉద్యానవన శాఖ అధికారిణి ధరిణి మాట్లాడుతూ ఒక్కో సంఘంలో 500 - 1000 మందికి పైగా రైతులు సభ్యులుగా ఉండవచ్చునని పేర్కొన్నారు. కలెక్షన్ సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సింజెంటా ప్రతినిధులు, రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు

నంద్యాలటౌన్: రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామున్, అధికారులు రుద్రవరం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేయగా అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది గైర్హాజరు కావడంతో కలెక్టర్ వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించడంతో సిబ్బందికి నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. విధుల పట్ల, ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంధత్వ నివారణ పక్షోత్సవాలు ప్రారంభం....

అంధత్వ నిర్మూలనకు ప్రజల్లో నేత్రదానం గురించి అవగాహన కల్పించడానికి అంధత్వ నివారణ పక్షోత్సవాలు ప్రారంభించామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేత్రదానం పట్ల అవగాహన లేక పోవడం వల్ల వేలాది మంది అంధత్వంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ నేత్రదానం పట్ల అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు అంధత్వ నివారణ పక్షోత్సవాలు ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ క్లినిక్‌లలో ఆశా, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది ద్వారా నేత్రదానం పట్ల అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

లింగ నిర్ధారణ నిషేధంపై అవగాహన

నంద్యాలటౌన్: లింగ నిర్ధారణ నిషేధ చట్టాల గురించి ఆశ కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలని ఆశా బోధకురాలు స్వర్ణగౌరి తెలిపారు. నూతనంగా నియమించబడిన ఆశా కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు లింగ నిర్ధారణ చట్టాల గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. సమాజంలో స్త్రీ పురుషుల నిష్పత్తిలో స్త్రీ జనాభా తగ్గితే అనేక దుష్పరిణామాలు కలుగుతాయన్నారు. డీసీఎం వీరన్న మాట్లాడుతూ ప్రజలకు అందించే వైద్యసేవలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య స్థితిగతులను ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం లింగ నిర్ధారణ నిషేద చట్టాల పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.